క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి (జగదాంబసెంటర్) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 257 క్యాలెండర్, డైరీ, వాల్ క్యాలెండర్, జీఓ బుక్ మొదలైనవి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని యూనియన్ నాయకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిబాబు, సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ రాచరాయుడు, గౌరవ సలహాదారులు రామాంజనేయులు, వెంకటరమణ, రమణ, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సుఖ సంతోషాలతో ఉండాలి



టంగుటూరి కృష్ణారెడ్డి

ఓబులవారిపల్లె : తెలుగువారి సాంప్రదాయ పండుగ సంక్రాంతి అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి కృష్ణారెడ్డి అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు పంటలు బాగా పండి సిరి సంపదలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారికి ఆశీర్వాదం



పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న మాజీ న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డి

వీరబల్లి : మండల కేంద్రంలోని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డి తన అక్క అంజలమ్మ నివాసంలో సోమవారం మేనకోడలు కుమారుడు అనూప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రంలో కేక్ కట్ చేసి అనూప్‌రెడ్డికి శుభ కాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

సుండుపల్లె : మండల పరిధిలోని ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ముడుంపాడు పంచాయతీలోని గోపాల కృష్ణాపురానికి చెందిన కావలి నాగార్జున, ఉషా కుటుంబ సభ్యులు రూ.20,016 నగదును సోమవారం అందజేసినట్లు ఆలయ అర్చకులు అమృత్ నాయక్ తెలిపారు.

‘ట్రూ అప్’ భారాన్ని ఉపసంహరించుకోవాలి



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సీపీఎం శ్రేణులు, చిన్నారులు

రాయచోటి అర్బన్ : ప్రజలపై టీడీపీ కూటమి ప్రభుత్వం పెంచిన, ట్రూ అప్ చార్జీల భారం రూ.20వేల కోట్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు స్థానిక పాత రాయచోటిలోని మున్సిపల్ కార్మికుల నివాస ప్రాంతంలో వారి కుటుంబీకులతో కలసి భోగి మంటలలో విద్యుత్ చార్జీల బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టకూడదంటూ డిమాండ్ చేశారు. గత పాలకుల తరహాలోనే కూటమి ప్రభుత్వం విద్యుత్, ఆర్టీసీ, టోల్‌గేట్, జీఎస్టీ, పెట్రోల్, గ్యాస్, డీజిల్, వంటనూనె, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించకపోతే ప్రజలు తగురీతిలో బుద్ధిచెప్పక తప్పదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నేతలు చెన్నయ్య, అశోక్, మాధవి, అంజనమ్మ, రాణి, మహమ్మద్‌ల కుటుంబీకులు పాల్గొన్నారు.

పగిలిన తాగునీటి పైప్‌లైన్



మాధవరం-1 గ్రామ పంచాయతీలో వృథాగా పోతున్న నీరు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని రోడ్డు నెంబర్ 16లో పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని ఆ ప్రాంత మహిళలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాగునీటి పైపు లైన్ పగిలిపోవడంతో రహదారి జలమయం అయ్యిందన్నారు. సంక్రాంతి వేడుకల్లో గృహాల ముందు నీరు ప్రవహిస్తుండటంతో తాము వాకిట్లో (ఇంటి ముందు) పండుగకు కల్లాపు చల్లుకొని ముగ్గులు కూడా వేసుకోలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు వృథా చేయవద్దు అని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా రహదారుల వెంబడి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్యను వివరణ కోరగా పంచాయతీలోని రోడ్డు నెంబర్ 16లో కొన్ని రోజులుగా తాగునీటి పైపు డ్యామేజ్ అయిన విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. ఆ ప్రాంతానికి ఇంజనీరింగ్ అసిస్టెంటు వెళ్లాడని సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా కూలీలు రావడంలేదని పండుగ అనంతరం సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

పేదలకు సాయం చేయడంలోనే ఆనందం



రాయచోటి అర్బన్: పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి దంపతులు



రాజంపేట: చీరలను పంపిణీ చేస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డిలు

రాయచోటి అర్బన్ : పేదలకు సాయం చేయడంలోనే ఆనందరం ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథ రామిరెడ్డి, కౌన్సిలర్ విజయమ్మ దంపతులు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం సుమారు 200 మంది మున్సిపల్ కార్మికులకు వైస్ చైర్మన్ దంపతులు బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత చెన్నయ్య అగ్గిరాముడు తదితరులు పాల్గొన్నారు.

చొప్పా సోదరుల ఆధ్వర్యంలో..

రాజంపేట : చొప్పా సోదరుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. 500 మంది మహిళలు చీరలను అందుకున్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి దంపతులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రాజంపేట రూరల్ ఏరియాల్లోని సిద్దులపల్లె, సిద్దులపల్లె హరిజనవాడ, హేమాద్రివారిపల్లెతో పాటు దళితవాడకు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో సిద్దులపల్లెలోని చొప్పా నివాస్ వద్ద సంక్రాంతి సందడి వాతవరణం నెలకొంది. కార్యక్రమంలో ఏయూ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలపై సంక్రాంతి ఎఫెక్ట్



కిలో రూ.160లకే కేజీ చికెన్ అంటూ ఏర్పాటు చేసిన బోర్డు



మరో దుకాణం వద్ద పోటీగా కేజీ చికెన్ రూ.150లకే అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెనగలూరు : సంక్రాంతి సందర్భంగా చికెన్ దుకాణాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. పెనగలూరు మండల కేంద్రంలో చికెన్ కొనే వారే లేకపోవడంతో ధర్పై ప్రభావం చూపించింది. నాలుగు రోజుల క్రితం కిలో రూ.250లు పలికిన చికెన్ ధర ప్రస్తుతం రూ.150లకు విక్రయిస్తున్నారు. అయినా ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో దండోరా వేసి మరీ ప్రజలను ఆకర్షిస్తున్నారు. దీంతో చికెన్ ప్రియులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా పక్క మండలాల్లో చికెన్ కిలో రూ.200లు, రూ.220లకు విక్రయిస్తుండగా.. పెనగలూరులో మాత్రమే రూ.150 అమ్ముతుండడంతో ఇక్కడ వ్యాపారులు కూడా ధర తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మృత్యుంజయేశ్వరుడికి రుద్రాభిషేకం



అలంకరణలో మృత్యుంజయేశ్వరుడు

నందలూరు : రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ పక్కనే వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పౌర్ణమి సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ మృత్యుంజయేశ్వర స్వామికి రుద్రాభిషేకాన్ని ఆలయ అర్చకులు నరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెనగలూరులో తేలికపాటి వర్షం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

పెనగలూరు : సంక్రాంతి అంటే ఏడాదికి ఒకసారి వచ్చి ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ. భోగి పండుగ రోజు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. 40 సంవత్సరాల క్రితం ఇలాగే మూడు పండుగలకు వాన పడిందని, ఆ తరువాత ఈ ఏడాది పండుగరోజు వర్షం కురిసిందని పెద్దలు మాట్లాడుకుంటున్నారు. తుంపరతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు పిండి వంటకాలు చేసుకొనే వారు ఇబ్బందులు పడ్డారు. పొలాల్లో ఆరుతడి పంటలు రైతులు ముందుగానే వేశారు. ఈ వర్షం వల్ల ఆరుతడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేస్తాం



మహమ్మద్ హాషీమ్



ఖదీర్ పర్వేజ్

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్‌లుగా జిల్లాకు చెందిన ఉర్దూ పండితుడు మహమ్మద్ హాషీమ్, ఖదీర్ పర్వేజ్‌లు ఎంపికనట్లు సోమవారం వారు ఇక్కడి విలేకరులకు చెప్పారు. ఆదివారం కడప పట్టణంలో జరిగిన రూటా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వీరి ఎంపిక కార్యక్రమం జరిగింది. సమావేశంలో రాష్ట్ర రూటా సాహిత్య వ్యవహారాల కమిటీ కన్వీనర్‌గా రాయచోటి పట్టణానికి చెందిన మహమ్మద్ హాషీమ్, విద్యా పరిరక్షణ సిఫార్సుల కమిటీ కన్వీనర్‌గా ఖదీర్ పర్వేజ్‌లుగా ఎంపికయ్యారు. వారు మాట్లాడుతూ తమ ఎంపికకకు కృషిచేసిన రూటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ విద్యాభివృద్ధికి తమ వంతు కృషి సల్పుతామంటూ పేర్కొన్నారు.

చీరకట్టు.. బెడద పోగొట్టు!



దోస పంటకు రక్షణగా కట్టిన చీరలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజంపేట, రాఘవరాజపురం, బొజ్జవారిపల్లె, ఉర్లగడ్డపోడు, శెట్టిగుంట, రెడ్డివారిపల్లె తదితర గ్రామాలో రైతులకు పందుల బెడద ఎక్కువ అయ్యింది. ఎన్ని విధాల ప్రయత్నించినా పందుల బారి నుంచి పంటను కాపాడుకోలేకపోతున్నారు. పందుల నుంచి ఎలాగైనా రక్షణ పొందాలని చివరికి చీరలను పంట చుట్టూ కట్టి రక్షణ పొందుతున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



కల్యాణ క్రతువును జరిపిస్తున్న వేదపండితుడు

నందలూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద సోమవారం శ్రీ గోదాదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఎంబలూరు అనిల్‌కుమార్, రాధిక దంపతులు కల్యాణానికి ఉభయ దాతలుగా వ్యవహరించారు. ముందుగా ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి వేద పండితుడు రామచంద్రయ్య మంత్రోచ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణల నడుమ కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతరం అమ్మవారిని విశిష్టత (కథ)ను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె మోహన్, సుబ్బరాయుడు, శ్రీను, లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతికి సంతాపం

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె వీఆర్ఏ భాస్కర్(50) అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు సోమవారం తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె కలరు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. భాస్కర్ గతంలో మండల గ్రామ సేవకుల సంఘం అధ్యక్షునిగా పని చేశాడు. ఆయన మృతి పట్ల మండల రెవెన్యూ యంత్రాంగం సంతాపం వ్యక్తం చేశారు.

వేడుకగా భోగి పండుగ



చిట్వేలి: బంతి భోజనం చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ కుటుంబం

తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి. సంక్రాంతి వేడుకల్లో భాగంగా తొలి రోజు భోగి పండుగను సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో వేకువజాము నుంచే ప్రజలు పెద్దఎత్తున భోగి మంటలను వేయడంతో ఎటుచూసినా భోగి కాంతులు కనిపించాయి. అనేక మంది భోగి మంటల్లోనే నీళ్లుకాచి స్నానాలు చేశారు. కొత్త దుస్తులతో భోగి వేడుకకు కొత్తదనాన్ని తీసుకొచ్చారు. అలానే అనేక మంది తల్లిదండ్రులు తమ చిన్న పిల్లలకు భోగిపండ్ల వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి తమ పిల్లలపై రేగిపండ్లను పోయించారు. చిన్నపిల్లలు ఉన్న ఇళ్లల్లో భోగిపండ్ల వేడుక సందడిగా సాగింది.

– సాక్షి, నెట్‌వర్క్



సుండుపల్లె: పోటీల్లో పాల్గొన్న పెద్దబలిజపల్లె గ్రామస్తులు



సిద్దవటం: గాంధీ వీధిలో పిండి వంటలు చేస్తున్న దృశ్యం



నందలూరు: మండల కేంద్రంలోని ఇళ్లముందు భోగి మంటల ముందు మహిళల సందడి



లక్కిరెడ్డిపల్లి: భోగి మంటలు వద్ద ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తులు



ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో భోగి మంటలు వెలిగిస్తున్న యువత, సర్పంచ్ జైపాల్ రెడ్డి



రైల్వేకోడూరు అర్బన్: తెల్లవారుజామున వేస్తున్న భోగి మంటలు



రాజంపేట టౌన్: చిన్నారులను ఆశీర్వదిస్తున్న మహిళలు



సుండుపల్లె: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ముగ్గు